క్లుప్తంగా

భైరవకోనలో డీఎస్పీ ప్రత్యేక పూజలు


పూజల్లో పాల్గొన్న డీఎస్పీ దంపతులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం, పర్యాటక ప్రాంతం భైరకోనను కనిగిరి డీఎస్పీ సాయిఈశ్వర్ యశ్వంత్ కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం సందర్శించారు. ఈసందర్భంగా త్రిముఖ దుర్గాదేవి, కాల భైరవ, భర్గులేశ్వర, నగరేశ్వర ఆలయాల్లో డీఎస్పీ చేత అర్చకులు విశేష పూజలు నిర్వహింపచేశారు. పూజల అనంతరం డీఎస్పీ, కుటుంబ సభ్యులకు అర్చకులు వేద ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేయగా ఈవో డి.వంశీకృష్ణారెడ్డి వారిని శేష వస్త్రంతో ఘనంగా సన్మానించారు. ముందుగా జలపాతాన్ని సందర్శించారు. కార్యక్రమంలో ఎస్సై ఎం.వెంకటేశ్వరనాయక్, పాల్గొన్నారు.

కనిగిరిలో వర్షం

కనిగిరిరూరల్: కనిగిరి ప్రాంతంలో ఆదివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన చిరుజల్లుల వర్షం కురిసింది. ఈదురు గాలికి పట్టణంలో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కల్గింది. రాత్రి 9గంటల వరకు తరచు కరెంట్ తీసి వేస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చిరుజల్లులతో కూడిన నాన్పుడు వర్షానికి పట్టణంలోని ప్రధాన వీధుల్లోని కాలువల్లో మురికి నీరు బయటకు వచ్చి పొంగిపొర్లడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. అంతేగాక శివారు ప్రాంతాల్లోని మట్టిరోడ్లు చిత్తడిగా మారాయి.

సీహెచ్ఓకు పాము కాటు


సీహెచ్ఓ జాస్మిన్‌కు వైద్యం అందిస్తున్న డాక్టర్ రవళి ప్రియాంక

పామూరు: మండలంలోని తూర్పు కట్టకింద పల్లె సీహెచ్ఓ (ఎంఎల్‌హెచ్‌పీ) జాస్మిన్ ఆదివారం పాము కాటుకు గురైంది. నూతనంగి నిర్మించిన ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో సోమవారం నుంచి వైద్యసేవలు అందించేందుకు అధికారుల ఆదేశాలతో ఆరోగ్యమందిర్‌ను శుభ్రం చేసేందుకు సీహెచ్ఓ, ఏఎన్ఎం, ఆశా కార్యకర్త అక్కడికి వెళ్లారు. భవనంలోకి వెళ్లే క్రమంలో మార్గమధ్యంలో చెట్లు ఉండగా పాము జాస్మిన్ కుడికాలి పాదానికి కాటువేసింది. వెంటనే ఆమెను ఏఎన్ఎం, ఆశా కార్యకర్త స్థానికుల సహాయంతో పామూరు సీహెచ్‌సీకి తరలించారు. డాక్టర్ రవళి ప్రియాంక్ సీహెచ్ఓకు ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యంకోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించగా ఆమె ఆరోగ్యం మెరుగ్గా ఉన్నట్లు డాక్టర్ తెలిపారు.

నేరాల్లో పాల్గొంటే కఠిన చర్యలు


మాట్లాడుతున్న డీఎస్పీ సాయిఈశ్వర్

కనిగిరిరూరల్: రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్లు చట్ట వ్యతిరేక కార్యకలాపాల్లో, నేరాల్లో పాల్గొంటే కఠిన చర్యలు ఉంటాయని డీఎస్పీ సాయిఈశ్వర్ యశ్వంత్ అన్నారు. స్థానిక సీఐ కార్యాలయ ఆవరణలో కనిగిరి, హెచ్‌ఎంపాడు స్టేషన్ల పరిధిలోని రౌడీ షీటర్లకు, సస్పెక్ట్ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. పోలీశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే తీవ్రంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ ఎస్‌కే ఖాజావలి, ఎస్సై టీ శ్రీరాం, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు

కందుకూరు రూరల్: స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు రెండో సెమిస్టర్ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు ఆధించినట్లు ప్రిన్సిపాల్ ఎం.రవికుమార్ తెలిపారు. రెండో సెమిస్టర్‌లో బీఏ 85 శాతం, బీఎస్సీలో 84 శాతం, బీకామ్ 72 శాతం ఫలితాలు సాధించినట్లు తెలిపారు. కళాశాలలో విద్యార్థులను ఉత్తమ పౌరులుగా ఉత్కృన్నత నైపుణ్యాలు కలిగిన వారిగా తయారు చేయడానికి అవసరమైన అన్ని సౌకర్యాలు ఉన్నాయని తెలిపారు. అత్యాధునిక కంప్యూటర్ ల్యాబ్, ఇతర సైన్స్ ల్యాబ్స్‌తోపాటు ఉపాధి కల్పలో శిక్షణ, విద్యార్థినులకు క్యాంపస్‌లోనే వసతి గృహం, కెరీర్ గైడెన్స్, ఉన్నత విద్య కోర్సులకు జరిగే పరీక్షలకు శిక్షణ ఇవ్వడం లాంటి అనేక వినూత్న క్యాక్రమాలు అమలు చేస్తున్నట్లుగా ఆయన తెలిపారు. మహిళా సాధికారత విభాగం ద్వారా విద్యార్థినులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కందుకూరు పరిసర ప్రాంత విద్యార్థులు టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరి తమ బంగారు భవిష్యత్‌కి బాటలు వేసుకోవాలన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి కొత్తగా బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్ ఉపాధి కోర్సులను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. మరుగైన ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు అడిషనల్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామ్స్ జె.హనుమంతరావు, అధ్యాపకులు పి.రాజగోపాల్, టి.హరీష్‌బాబు, తదితరులు అభినందించారు.

పట్టించుకోరు.. పనులు పూర్తవ్వవు !

- అసంపూర్తిగా ఆశ్రమ పాఠశాల కొత్త భవనం నిర్మాణం
- ఏడాదిగా పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- నిధులు మంజూరైనా ప్రారంభం కాని మిగిలిన పనులు
- విన్నవించినా పట్టించుకోని మంత్రి స్వామి, అధికారులు


పొన్నలూరులో అసంపూర్తి నిర్మాణంతో నిరుపయోగంగా ఆశ్రమ పాఠశాల కొత్త భవనం

పొన్నలూరు:

అధికారంలోకి రాకముందు లెక్కలేనన్నీ వాగ్దానాలు.. తీరా వచ్చాక ఇవ్వకుండానే అన్నీ ఇచ్చేశాం అని బెదిరింపులు. గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులకు సౌకర్యాలతో కడిన విద్యను అందిస్తామని ఊదరగొడుతున్న కూటమి ప్రభుత్వం ఆదిశగా అడుగులు వేయలేకపోతుంది. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్నా పాఠశాలల్లో విద్యా వసతులను కల్పించడంలో పూర్తిగా విఫలమైంది. ఆక్రమంలోనే పేద గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన గిరిజన ఆశ్రమ పాఠశాల సొంత భవనం, కనీస వసతులకు నోచుకోక కునారిల్లుతోంది. పొన్నలూరులో 2000లో గిరిజన ఆశ్రమ పాఠశాలను ఏర్పాటు చేశారు. పాఠశాల మంజూరైంది మొదలు నేటి వరకు 25 ఏళ్లగా అద్దె భవనంలోనే కొనసాగిస్తున్నారు. మొదటిలో ఈ పాఠశాల్లో 1వ తరగతి నుంచి 7 వరకు ఉన్నా, ఆ తరువాత గత ప్రభుత్వం 2022లో 10వ తరగతి వరకు చదువుకునే అవకాశాన్ని గిరిజన విద్యార్థులకు కల్పించింది. మొదటిలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్నప్పటికి ఆ తరువాత ఉపాధ్యాయుల కృషితో ప్రస్తుతం 150 మంది ఉన్నారు. ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య బాగానే ఉన్నప్పటికి ఆశ్రమ పాఠశాల కోసం నిర్మిస్తున్న నూతన భవనం మధ్యలోనే పనులు ఆగిపోయి అసంపూర్తిగా దర్శనమిస్తుంది. దీంతో ప్రస్తుతం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. అలాగే స్థానికులు గొర్రెలను ఉంచుతూ అపరిశుభ్రంగా చేస్తున్నారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్నా పట్టించుకున్న పాపాన పోలేదు. మిగిలిపోయిన పనులకు నిధులు మంజూరు చేసి భవనాన్ని పూర్తిస్థాయిలో నిర్మించడానికి అడుగులు ముందుకు వేయలేదు.

నిరుపయోగంగా కొత్త భవనం..

గిరిజన ఆశ్రమ పాఠశాలకు పక్కభవనం నిర్మించడానికి కొన్నేళ్ల క్రితం శ్రీశైలం గిరిజన సమగ్ర అభివద్ధిశాఖ సంస్థ నుంచి రూ.5.40 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఈ క్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పక్కనే నిర్మించడానికి 1.10 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి అందులో రూ.3.50 కోట్లతో భవనం నిర్మాణ పనులు చేపట్టి 80 శాతం వరకు నిర్మాణ పనులు పూర్తిచేశారు. అయితే మిగిలిన ఫ్లోరింగ్, గ్రిల్స్, తలుపులు, కిటికీలు, ప్రహరీ, విద్యుత్ సౌకర్యం, మరుగుదొడ్లు నిర్మాణం పనులను చేయకుండా కాంట్రాక్టర్ వెళ్లిపోయాడు. ఈ క్రమంలో అప్పటి కలెక్టర్ ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసి స్పందించాడు. ఆ వెంటనే గిరిజన సమగ్ర అభివద్ధిశాఖ సంస్థకు నిధులు మంజూరు చేసి భవనం నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. దీంతో ఆ శాఖ వారు మిగిలిన పనులను పూర్తి చేయడానికి రూ. 2.50 కోట్లతో అంచనాలు తయారు చేసి నిధులు మంజూరు కోసం విజయవాడ ఈఎన్‌సీ కార్యాలయానికి పంపించారు. అయితే వారు నిధులు మంజూరు చేయకపోవడం వలన భవనం అసంపూర్తి పనులు కార్యరూపం దాల్చలేదు.

విన్నవించినా వినిపించుకోని మంత్రి స్వామి..

ఇదిఇలా ఉంటే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత అసంపూర్తిగా మిగిలిపోయిన గిరిజన ఆశ్రమ పాఠశాల నూతన భవనం గురించి పాఠశాల ఉపాధ్యాయులు మంత్రి బాలవీరాంజనేయస్వామి కలిసి విన్నవించారు. ముఖ్యంగా అసంపూర్తిగా మిగిలిన పనులను ప్రారంభించి భవనాన్ని పూర్తిస్థాయిలో నిర్మించడానికి కావాల్సిన నిధుల మంజూరుకు సంబంధించిన ఫైల్‌ను కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత గత ఏడాది సెప్టెంబర్‌లో మంత్రి స్వామికి అందించారు. తొమ్మిది నెలలు కావస్తున్నా ఇప్పటికి నిధులు మంజూరై భవనాన్ని పూర్తిస్థాయిలో నిర్మించడానికి పనులు ప్రారంభించిన దాఖలాలు లేవు.

ఈ ఏడాది కూడా అద్దె భవనంలోనే..

పొన్నలూరులో గిరిజన ఆశ్రమ పాఠశాలను ఏర్పాటు చేసి 25 సంవత్సరాలైంది. ఇన్నేళ్లుగా గిరిజన విద్యార్థులు అద్దె భవనంలోనే చాలీచాలని గదుల్లో అవస్థలు పడుతూ చదువుకుంటున్నారు. అయితే నూతనంగా పక్కా భవనం మంజూరై 80 శాతం వరకు భవనం నిర్మాణ పనులు అయిపోయాయి. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత మళ్లీ విద్యా సంవత్సరం వచ్చే వరకు ఈ సమస్యను గాలిగొదిలేశారు. నిధులు మంజూరు చేసి భవనం పూర్తిస్థాయిలో నిర్మించకపోవడంతో ఈ ఏడాది కూడా అద్దె భవనంలోనే అవస్థలు పడాల్సి వస్తుందని విద్యార్థులు, ఉపాధ్యాయులు వాపోతున్నారు. మొత్తంగా అధికారుల పనితీరు, పాలకుల నిర్లక్ష్యం వలన గిరిజన ఆశ్రమ పాఠశాల అసంపూర్తిగా మిగిలిపోయి అద్దె భవనంలో కొనసాగాల్సి వస్తుంది.


నూతన భవనంలో గొర్రెల కోసం ఏర్పాటు చేసిన వస్తువులు


25 ఏళ్లుగా అద్దె భవనంలో కొనసాగుతున్న గిరిజన ఆశ్రమ పాఠశాల

చెరువును తలపిస్తున్న రోడ్డు


దుర్వాసన కొడుతూ రోడ్డులో నిలిచి ఉన్న వర్షపు నీరు

కొండపి: మండల కేంద్రం కొండపిలోని జెండా చెట్టు సెంటర్, విష్ణాలయం వీధిలో రోడ్డు చెరువును తలపిస్తోంది. కురిసిన కొద్దిపాటి వర్షానికి సైడ్ కాలవలు లేకపోవడంతో వర్షపు నీరు రోడ్డుమీద నిలబడుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతాం.. డ్రైనేజ్ తదితర సమస్యలు లేకుండా ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండేందుకు స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారు. కార్యక్రమం కేవలం మాటలకే పరిమితం అవుతుందని, డ్రైనేజీ సమస్యలను పట్టించుకోవడంలేదని ఆ వీధి ప్రజలు వాపోతున్నారు. శుక్రవారం కురిసిన కొద్దిపాటి వర్షానికి ఆ రోడ్డులో వర్షపున నిలబడి వాహనదారులు ప్రజలు దారిలో ప్రయాణించాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ నీటిలో నడుస్తూ ఓ మహిళ పడిపోయిందన్నారు. రోడ్డులో వర్షపు నీరు ఉండడంతో నడవడానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ద్విచక్ర వాహనదారులు సైతం ఆ వీధిలో ప్రయాణించాలంటే భయాందోళనగా ఉందని అంటున్నారు. రెండు రోజుల నుంచి నీరు నిల్వ ఉండడంతో వాసన కొడుతుందని రాత్రి వేళలో నీరు నిల్వ ఉండడంతో దోమల బెడద ఎక్కువగా ఉంటుందని తద్వారా దోమ కాటు వలన జ్వరాలు ప్రబలే అవకాశం ఉంటుందని విష్ణాలయం వీధిలోని ప్రజలు వాపోతున్నారు. అధికారులు వెంటనే స్పందించి సైడ్ కాలవలు నిర్మించి రోడ్డు మీద వర్షపు నీరు నిలవకుండా చూడాలని ప్రజలు కోరుకుంటున్నారు.

షోయబ్ నిజాయితీ అందరికీ ఆదర్శం


షోయబ్‌ను సన్మానిస్తున్న ముస్లిం మత పెద్దలు

కందుకూరు: తనకు దొరికిన బంగారాన్ని నిజాయితీగా పోగొట్టుకున్న వ్యక్తులు అప్పగించి చిన్నతనంలో తన నిజాయితీని చాటిన షోయబ్ పలువురికి ఆదర్శమని యూనిటీ ఫోరం ఫర్ డెవలప్‌మెంట్ రిప్రజెంటేటివ్ షేక్ ఖాజాహుస్సేన్ అన్నారు. ఈ సందర్భంగా స్థానిక కార్యాలయంలో ముస్లిం మత పెద్దల ఆధ్వర్యంలో షోయబ్‌ను ఆదివారం ఘనంగా సన్మానించారు. పట్టణంలోని ఓ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న షోయబ్ అనే పిల్లాడికి ఇటీవల మార్కెట్ సెంటర్‌లో రూ.7 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు దొరికాయి. వీటిని ఇంటికి తీసుకెళ్లి తల్లిదండ్రులతో కలిసి వచ్చి పోలీసులకు అప్పగించారు. అప్పటికే నగలు పోగొట్టుకున్న వ్యక్తి పోలీసులను ఆశ్రయించాడు. దీంతో షోయబ్ తెచ్చిన బంగారు నగలను ఆ నగల యజమానికి అప్పగించారు. దీంతో షోయబ్ ప్రదర్శించిన నిజాయితీపట్ల ప్రతి ఒక్కరూ అభినందనలు తెలిపారు. అత్యంత పేదరికంలో ఉండి కూడా పరాయి సొమ్ముకు ఆశపడకుండా నిజాయితీగా దొరికిన నగలు అప్పగించడం అభినందనీయమని, ఇలాంటి పిల్లలను ప్రోత్సహించి చదువుకునేందుకు అవసరమైన సహాయ సహకరాలు అందించాలని ముస్లిం మత పెద్దలు అన్నారు. పట్టణంలో అనేక మంది పేద ముస్లింలు తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించలేక ఇబ్బందులు పడుతున్నారని ఇలాంటి వారికి సరైన కౌన్సెలింగ్ ఇచ్చి ప్రోత్సాహం అందించాలన్నారు. అనంతరం స్టూడెంట్ మొబైల్స్ యజమాని షేక్ సలాం సౌజన్యంతో చిన్నారి షోయబ్‌కు రూ.10 వేల ఆర్థిక సాయం అందించడంతో పాటు, ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు మౌల్వీ నజీర్, షేక్ మహబూబ్‌భాషా, షేక్ ముస్తఫా, ఆటో మొబైల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సయ్యద్ జిలాని, రవాణాశాఖ ఉద్యోగి మసూద్, రిటైర్డ్ డిఫెన్స్ అధికారి సయ్యద్ సిరాజ్, షేక్ జహంగీర్ మలాంగ్, మహబూబ్‌బాషా, అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ షేక్ మొహ్మద్ ఖాశీం తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగ తెగిపడి అగ్ని ప్రమాదం


విద్యుత్ తీగ తెగిపడటంతో రేగుతున్న మంటలు

సీఎస్‌పురం(పామూరు): విద్యుత్ తీగ తెగిపడి అగ్నిప్రమాదం చోటుచేసుకున్న ఘటన మండలంలోని కోవిలంపాడు ముస్లిం కాలనీలో ఆదివారం చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. కోవిలంపాడు ముస్లిం కాలనీ గుండా ఆనికాలపల్లెకు పోయే 11 కేవీ విద్యుత్‌లైన్ వైర్ ప్రమాదవశాత్తు తెగి షేక్.మస్తానమ్మ ఇంటిమీద పడటంతో ఒక్కసారిగా మంచం, ఇతర వస్తువులకు నిప్పంటుకున్నాయి. వెంటనే మంటలు వ్యాపించి వస్తువులు, ఇల్లు పాక్షికంగా కాలిపోయింది. అదేవిధంగా అధిక విద్యుత్ రావడంతో కాలనీలోని పలువురు నివాసాల్లో ఎలక్ట్రిక్ పరికరాలు కాలిపోయి నష్టం వాటిల్లింది. ఘటనా స్థలాన్ని విద్యుత్‌శాఖ పామూరు ఏడీఈ కృష్ణారెడ్డి, ఏఈ రసూల్ పరిశీలించి తెగిపోయిన విద్యుత్‌లైన్‌కు మరమ్మతులుచేసి విద్యుత్‌ను పునరుద్ధరించారు. కాగా ప్రమాద సమయంలో ఆప్రాంతంలో ఎవరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. తక్షణం విద్యుత్‌లైన్ ఇండ్లమీద లేకుండా తొలగించాలని కాలనీవాసులు కోరుతున్నారు.


కాలిపోయిన మంచం, సైకిల్ వస్తువులు

వైభవంగా గోపూజ, అభిషేకోత్సవం


గోపూజలో పాల్గొన్న ఆలయ కమిటీ, భక్తులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో మహానివేదన, గోపూజ, అభిషేకోత్సవ కార్యక్రమం అర్చకులు మంకాల శివప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో ఆదివారం వేదమంత్రాలతో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఉదయం శ్రీనారాయణస్వామి వారి మూలవిగ్రహమూర్తికి, శ్రీదేవి, భూదేవి సమేత విష్ణుమూర్తివారి ఉత్సవమూర్తులకు అర్చకులు అభిషేకం, ప్రత్యేకపూజలు నిర్వహించారు. అదేవిధంగా గోపూజా మందిరంలో గోపూజ నిర్వహించారు. అనంతరం భజంత్రీల మేళతాళాల నడుమ ఆలయం చుట్టూ నైవేద్యంతో ప్రదక్షిణలు చేసి పొంగలిని స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు. దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన ఆదినారాయణ, ఈఓ. ఎస్‌జీఆర్. నరసింహబాబు, కొమ్మినేని వెంకట్రావు, పాములపాటి మాధవప్రసాద్, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

బేవాచ్ టవర్‌తో బీచ్ ప్రమాదాల నివారణ


బేవాచ్ టవర్ పైఅంతస్తు ప్రారంభిస్తున్న మంత్రి, కలెక్టర్, ఎస్పీ

సింగరాయకొండ: పాకల బీచ్‌లో సుమారు రూ.15 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన బేవాచ్ టవర్ నిర్మాణంతో బీచ్‌లో ప్రమాదాలను నివారించవచ్చని రాష్ట్ర మంత్రి స్వామి అన్నారు. పాకల బీచ్‌లో ఆదివారం నూతనంగా నిర్మించిన బేవాచ్ టవర్ ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ టవర్ నిర్మాణంతో బీచ్‌లో పర్యాటకులు ప్రమాదానికి గురి కాకుండా రక్షణ కల్పించటానికి అవకాశం కలుగుతుందన్నారు. ఎస్పీ ఏఆర్ దామోదర్ మాట్లాడుతూ బీచ్ పర్యాటకుల భద్రతతో పాటు, అసాంఘిక కార్యకలాపాలను నిరోధించడానికి అవకాశం కలుగుతుందని అంతేకాక టవర్‌లో అత్యాధునిక సీసీ కెమెరాలు, పబ్లిక్ అడ్రెసింగ్ సిస్టం, టైమ్ క్లాక్ అనౌన్స్‌మెంట్ సిస్టం ఏర్పాటు చేసినట్లు వివరించారు. జేసీ గోపాలకృష్ణ, సీఐ సీహెచ్ హజరత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులను గౌరవించడం మనందరి బాధ్యత


మాట్లాడుతున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరిరూరల్: వృద్ధులను గౌరవించడం మనందరి బాధ్యత, సంస్కృతి అని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక కాస్మోపాలిటన్ క్లబ్ ఆవరణలో ప్రపంచ వృద్ధుల దుర్వినియోగ అవగాహన దినోత్సవం ఆదివారం న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గఫార్ మాట్లాడుతూ వృధ్యాప్యంలో ఉన్న వారి పట్ల వివక్షత చూపడం సరైనది కాదన్నారు. వృద్ధుల పట్ల కరుణ, ప్రేమ, బాధ్యతతో వ్యవహరించాలన్నారు. న్యాయవాదుల బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సయ్యద్ జానీ షాహీద్ మాట్లాడుతూ వృద్ధుల పట్ల శారీరక, మానసిక, ఆర్థిక, భావోద్వేక దుర్వినియోగం, నిర్లక్ష్యం చేయకూడదన్నారు. ఇవన్నీ దుర్వినియోగం కిందకు వస్తాయని తెలిపారు. నల్సా చట్టం గూర్చి అవగాహన కల్పించారు. న్యాయసేవాధికార సంస్థ హెల్ప్ లైన్ 15100 గూర్చి తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ విశ్రాంతి ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు తమ్మినేని పెద్దిరెడ్డి, మంద్రు రమేష్ బాబు, పారాలీగల్ వలంటీర్, గుడ్ హెల్ప్ ఫౌండేషన్, న్యాయవాదులు, బార్‌అసోసియేషన్ సభ్యులు, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికత జ్ఞానం మానవునికి ఎంతో మేలు


మాట్లాడుతున్న ఆధ్యాత్మికవేత్త కృష్ణా

కనిగిరిరూరల్: ఆధ్యాత్మిక జ్ఞానంతో ప్రతి ఒక్కరూ ఆనందంగా జీవించాలని ఆధ్యాత్మికవేత్త, మనస్తత్వవేత్త కర్లపుడి కృష్ణా, మాజీ మంత్రి ముక్కు కాశిరెడ్డిలు అన్నారు. స్థానిక సాయిబాబా దేవస్థానంలో సద్గురు సాయి సేవా సమితి, షిరిడి సాయి బాబా దేవస్థానం ఆధ్వర్యంలో సత్సంగ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆధ్యాత్మికవేత్త కర్లపుడి కృష్ణా మాట్లాడుతూ ఆధ్యాత్మికత జ్ఞానం మానవునికి ఎంతో మేలు చేస్తోందన్నారు. సాయి సచ్చరితలోని అనేక అంశాలను గూర్చి వివరించారు. మాజీ మంత్రి ముక్కు కాశిరెడ్డి మాట్లాడుతూ ఆధ్యాత్మికతలో జీవించే వారికి మానసిక ప్రశాతంత కల్గుతుందన్నారు. అనంతరం కర్లపుడి కృష్ణా దంపతులను సద్గురు సాయి సేవాసమితి, బాబా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో దేవకి సుబ్రహ్మణ్యం, కుందురు తిరుపతిరెడ్డి, కొప్పరపు సత్యాలు, బాలు ఓబుల్ రెడ్డి, ముచ్చర్ల ధర్మరావు, సింగరాజు మాలకొండేశ్వరరావు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు